క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఈ

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఏఈ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్ అనిల్, ముషీద్, ఏడుకొండలు, శ్రీనివాసులు, బాబు, రామచంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ అభ్యున్నతికి కృషి చేయండి



బీసీ విభాగం అధ్యక్షుడితో వెంకటరమణయ్య

చిట్టమూరు : బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాచగొల్ల రమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం రాష్ట్రంలోని బీసీ విభాగం నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో చిట్టమూరు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బద్దిగ వెంకటరమణయ్య పాల్గొన్నారు. రాచగొల్ల రమేష్‌యాదవ్‌కు పుష్ప గుచ్ఛం అందజేశారు. గూడూరు నియోజకవర్గంలో పార్టీ గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే తాను తిరుపతి జిల్లా పర్యటనకు వస్తానని, గూడూరులోని బీసీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తానని రమేష్‌యాదవ్ చెప్పినట్టు తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

కోట: వరకట్నం కోసం భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారని విద్యానగర్‌కు చెందిన మెహతాజ్ శనివారం ఎస్ఐ పవన్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ విచారణ చేపట్టి భర్త జాకీర్, అత్తమామలు షకీలా, జలీల్‌పై కేసు నమోదు చేశారు.

నేడు కలిచేడు మైకా మైన్ స్కూల్ ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు



మైకా మైన్ పాఠశాల

సైదాపురం : మండలంలోని కలిచేడులో వున్న మైకామైన్ పాఠశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేశారు. కలిచేడులో 1945లో కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మైకా కార్మిక సంక్షేమ సంస్థ ఉన్నత పాఠశాల, 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. మైకా గనులు తగ్గుముఖం పట్టడంతో ఆస్పత్రిని మూసివేశారు. పాఠశాల మాత్రం నడుస్తోంది. ఇక్కడ చదివిన వందలాది మంది దేశవిదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల ఏర్పాటు చేసి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఆదివారం ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరిస్తామని ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ తెలిపారు.

24న ర్యాలీకి అనుమతి ఇవ్వాలని వినతి



డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం మతపెద్దలు

నాయుడుపేట టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 24న నాయుడుపేటలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టనున్నట్టు జామియా మసీదు ముతవల్లీ హాజీ రహంతుల్లా సాహెబ్ తెలిపారు. ముస్లిం మతపెద్దలు శనివారం ర్యాలీకి అనుమతి కోరుతూ డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిర్వహించే ర్యాలీకి నాయుడుపేట నుంచే కాకుండా ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం, చిట్టమూరు తదితర మండలాల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. వివాదాలకు తావు ఇవ్వకుండా కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాజీ నిజామ్, సుభహానీ, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారిపై ఫిర్యాదు

తిరుపతి అర్బన్ : సూళ్లూరుపేట బీసీ బాలిక హాస్టల్ వార్డెన్‌పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నాయుడుపేట డివిజన్ బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వారు శనివారం కలెక్టరేట్‌లో ఏవో భారతికి వినతి పత్రం అందించారు. ఇదిలా ఉండగా దీనిపై ఇప్పటికే బాధిత వార్డెన్ సైతం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆయన విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

ఇన్‌చార్జిలే దిక్కు

తడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. మండల అధికారులను నియమించకుండా ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. వారు కార్యాలయానికి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియక ప్రజలు తిప్పలు పడుతున్నారు. సిబ్బంది కూడా ఒకరిద్దరు మినహా శనివారం ఉదయం 11 గంటలైనా ఆఫీసులకు రాలేదు. తడ మండలంలో రెగ్యులర్ తహసీల్దార్ లేరు. డీటీ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ కొనసాగుతున్నారు. దీనికి తోడు ఏవో, సీనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. టైపిస్టు చనిపోయి ఏడాది అయినా ఆ పోస్టును భర్తీ చేయలేదు. నలుగురు అటెండర్లలో ముగ్గురు బదిలీ అయ్యారు. ఉన్న ఒక్కరు సెలవులో ఉన్నారు. తహసీల్దార్ కార్యాలయంలోనూ సిబ్బంది కొరత వేధిస్తోంది. వీఆర్వోలు, ఆర్ఐ అందుబాటులో ఉండడం లేదు. దీంతో ఆదాయం, కులం, నివాసం తదితర సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెగ్యులర్ సిబ్బందిని నియమించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



10.35 గంటలైనా ఖాళీగా ఉన్న ఎంపీడీవో కార్యాలయం



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం



వీఆర్వో ఫోన్ నంబరు కోసం వెదుకుతున్న ఒక వ్యక్తి

కల్యాణం.. కమనీయం



పెంచలకోనలో స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తరలించి విశేషంగా అలంకరించారు. తదుపరి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊంజల్ సేవ చేశారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

నాయుడుపేట టౌన్ : అంగన్‌వాడీల్లోని ఐదేళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఈవో బాణాల మునిరత్నం తెలిపారు. ఆయన శనివారం పుదూరు అంగన్‌వాడీ కేంద్రంలో 5 ఏళ్లు పూర్తి చేసుకున్న పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మంచి వసతులు ఉన్నాయని తెలిపారు. ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణెమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పి.రత్నకుమారి, వై.శాంతమ్మ, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సన్మానం



మునిశేఖర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

పెళ్లకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శెట్టిపల్లి మునిశేఖర్ ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో ఆయనకు శనివారం పాఠశాల ప్రాంగణంలో సన్మానం చేశారు. ఎంఈవో శంకరయ్య హెచ్‌ఎం సేవలను కొనియాడారు. అనంతరం మునిశేఖర్, వసుంధర దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, న్యాయవాది గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్

చిల్లకూరు : మండలంలో భూ ఆక్రమణలపై విచారణ కొనసాగుతోందని, ఆక్రమణలకు పాల్పడినట్టు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన శనివారం గూడూరు పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా చిల్లకూరు మండలంలో జరుగుతున్న భూ ఆక్రమణలపై విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో 40 ఏళ్లుగా భూముల రికార్డులు గందరగోళంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం క్రిస్ సిటీ రావడం, సాగరమాల రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో ప్రత్యేకత సంతరించుకుందన్నారు. భూముల విషయంపై పలు ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిపై గత నెలలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ విచారణ చేసి జేసీకి నివేదికలు అందజేసినట్టు వెల్లడించారు. అక్కడ కూడా విచారణ పూర్తయిన తర్వాత నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఈశ్వరయ్య సేవలు అనిర్వచనీయం



ఈశ్వరయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కసుకుర్తి ఈశ్వరయ్య ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో శనివారం పాఠశాలలో హెచ్‌ఎం వి.స్వర్ణలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఈశ్వరయ్యను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు సమష్టి కృషి



రాపూరులో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎంపీడీవో భవాని



ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, మెప్మా మహిళలు తదితరులు



కలువాయిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కలువాయి(సైదాపురం)/ఓజిలి/రాపూరు/బాలాయపల్లి (సైదాపురం)/నాయుడుపేట టౌన్/వాకాడు : స్వచ్ఛాంధ్రను సాధించేందుకు సమష్టిగా కృషి చేద్దామని కలువాయి ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్, ఓజిలి, రాపూరు, బాలాయపల్లి, నాయుడుపేట ఎంపీడీవోలు విజయలక్ష్మి, భవాని, వినీల్‌కుమార్, సురేష్ బాబు, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, వాకాడు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. కలువాయి, ఓజిలి, రాపూరు, బాలాయపల్లి, వాకాడులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దామని పిలుపునిచ్చారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. బాలాయపల్లిలో పాడైపోయిన ఎలక్ట్రికల్ వస్తువులను సేకరించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు. నాయుడుపేటలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రధాన కూడళ్లలో వున్న చెత్తను తొలగించారు. దుకాణాల వద్ద నిరుపయోగంగా వున్న ప్లాస్టిక్‌ను సేకరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కలువాయి సిబ్బంది శ్రీనివాసులు, సునీల్, ఓజిలి డీటీ మధుసూదన్, ఎంఈవో శైలజ, ఏపీఎం పద్మమ్మ, రాపూరు ఈవోపీఆర్‌డీ బాలకృష్ణారెడ్డి, బాలాయపల్లి ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, ఏపీఎం పోలమ్మ, వాకాడు డీటీ సందీప్‌కుమార్, ఎంఈవో నసీంఅలీ, వాకాడు ఎస్ఐ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఓజిలి : విద్యార్థుల మానవహారం



వాకాడు : స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న అధికారులు



బాలాయపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో వినీల్‌కుమార్

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



కోటలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ



తడలో రన్ ఫర్ జీసస్

కోట/తడ : కోట, తడ మండలాల్లో శనివారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకల్లో భాగంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోట గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. అలాగే తడ మండలంలోని తడకండ్రిగలో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో శ్రీసిటీ జీరో పాయింట్ నుంచి తడ బజారు మీదుగా ర్యాలీ చేశారు. యువకులు గీతాలు ఆలపించారు. మత పెద్దలు క్రీస్తు బోధనలు వినిపించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వేము దినకర్‌బాబు, పాస్టర్లు నోవాబాబు, శ్యామ్‌సుందర్, ప్రభుకుమార్, ప్రభాకర్, రత్నం, తడలో సంఘం చైర్మన్ జాన్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలే బిడ్డకు తొలి టీకా





సైదాపురం : మాట్లాడుతున్న సూపర్‌వైజర్, రాపూరు : గోనుపల్లిలో అవగాహన కల్పిస్తున్న రాజ్యలక్ష్మి

సైదాపురం/రాపూరు : పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలే తొలి టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.సౌజన్య, రాజ్యలక్ష్మి తెలిపారు. సైదాపురం మండలం జాఫాలపురం, రాపూరు మండలం గోనుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపు పాలు తాగించాలన్నారు. తద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. బాలింతలు, గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, భాగ్యమ్మ, శైల తదితరులు పాల్గొన్నారు.

తల్లంపాడులో పల్లె నిద్ర

దొరవారిసత్రం : మండలంలోని తల్లంపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి ఎస్ఐ అజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, స్మార్ట్ లాక్ తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు స్టోరీ బుక్స్, విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తిరులపాలయ్య, పరంధామయ్య పాల్గొన్నారు.





నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్, పిల్లలకు స్టోరీ బుక్స్ ఇస్తున్న ఎస్ఐ

కలిచేడు గ్రామ సచివాలయం తనిఖీ

సైదాపురం: మండలంలోని కలిచేడు గ్రామ సచివాలయంలో ఉన్న రైతు సేవా కేంద్రం పనితీరును శనివారం ఏవో హైమావతి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం తురిమెర్ల గ్రామం చేరుకుని సిబ్బందితో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగులో మెళకువలు తెలియజేయాలని ఆదేశించారు.

21న మోడల్ ప్రవేశ పరీక్ష

దొరవారిసత్రం : మండలంలోని మావిళ్లపాడులో ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ సుమలత తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అందులో ఫొటో లేకపోయినా ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. హాల్ టికెట్‌పై ఫొటో అంటించి హెచ్‌ఎంతో సంతకం చేయించుకుని మరో ఫొటో తీసుకుని రావాలని తెలిపారు.

కండలేరులో 45.950 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 45.950 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,390, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి



రాపూరులో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వెంకటగిరి రూరల్/రాపూరు/కోట/నాయుడుపేట టౌన్ : వేసవిలో అగ్నిప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని వెంకటగిరి, రాపూరు అగ్నిమాపకశాఖ అధికారులు ఆదినారాయణ, కుప్పయ్య, కోట ఎస్ఎఫ్‌వో హరీష్, నాయుడుపేట అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి డీవీ రమణయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం వెంకటగిరి ఆరోగ్య సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల, రాపూరు ప్రభుత్వ వైద్యశాల, కోట సామాజిక ఆరోగ్య కేంద్రం, నాయుడుపేటలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు, పలు కూడళ్ల వద్ద అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అధికారులకు ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యశాలల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అత్యవసర ద్వారాలను వినియోగించుకోవాలని, లిఫ్టలను వినియోగించవద్దన్నారు. కోటలో సిబ్బంది సిద్దిక్, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ మీజురు చంద్రకళ, ప్రైవేటు వైద్యులు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటగిరిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ నారాయణ



కోట : అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది

బైక్‌లను ఢీకొన్న ఆటో

- ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం మన్నూరు రోడ్డు సమీపంలో శనివారం ఆటో అదుపుతప్పి రెండు బైక్‌లను ఢీకొంది. దీంతో ఇద్దరు తీవ్రంగాను, ఒకరు స్వల్పంగాను గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. డక్కిలి మండలం మాటుమడుగు గ్రామానికి చెందిన మోరా వెంకటరత్నయ్య తన కుమార్తె సంజన, వెంగమనాయుడుపల్లికి చెందిన తన బావమరిది బాలగురవయ్య రెండు బైక్‌లలో గూడూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గూడూరు వైపు నుంచి వెంకటగిరి వైపు వస్తున్న ఆటో మన్నూరు రోడ్డు సమీపంలో అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో వెంకటరత్నయ్య, బాలగురవయ్యకు తీవ్రంగా గాయపడ్డారు. సంజనకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వారిని గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. బాలగురవయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.